క్లుప్తంగా

నూతన తహసీల్దార్‌గా దత్తు ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న దత్తు ప్రసాద్

కెరమెరి: మండల తహసీల్దార్‌గా దత్తు ప్రసాద్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలో విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మునావర్ షరీఫ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు.

బీజేపీ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి



లింగాపూర్: మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

కాగజ్‌నగర్‌రూరల్: విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలోని ఆడిటోరియంలో నిర్వహించిన యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న జైనూర్, 23న కాగజ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద రోడ్డుషో నిర్వహించనున్నట్లు తెలిపారు.

లింగాపూర్: బీజేపీ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాథోడ్ రమేశ్ మంగళవారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న బీజేపీ సంకల్పయాత్ర మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రామారావు, జాదవ్ జీవంత్ రావు, రమేశ్, అనిల్ తదితరులు ఉన్నారు.

కాంప్లెక్స్ సమావేశం

కెరమెరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోయగాంలో బుధ, గురువారాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్లు మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

పెంచికల్‌పేట్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కొమురయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాకు 50కి పైగా కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు.

కౌటాల: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కౌటాల సీఐ సాధిక్‌పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జాబ్ మేళాపై అవగాహన కల్పించారు.

ఆసిఫాబాద్‌రూరల్: మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సంతోష్, ఎస్సై మహేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహిళ డిగ్రీ గురుకుల కళాశాలతో పాటు ప్రధాన కూడలి, బస్ స్టేషన్‌లో మెగా ఉద్యోగ మేళా పోస్టర్లను అతికిస్తూ అవగాహన కల్పించారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

జైనథ్: ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో సాయన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వారీగా ఆడిట్ నివేదికలు పరిశీలించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అన్ని పంచాయతీల్లో రూ.2.013 కోట్ల పనులు చేపట్టగా, వాటికి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను బృందం సభ్యులు చదివి వినిపించారు.

ఘనంగా సప్తాహం ముగింపు వేడుకలు

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలో బాజీరావ్ బాబా సప్తాహం ముగింపు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో భక్తులు పూజలు, గీతాపారాయణం, హరిపాట్ గావించారు. అనంతరం బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగున పల్లకికి పూజలు చేశారు.

వీధి కుక్కలతో బెంబేలు!

- ప్రజలు, జీవాలపై దాడులు
- జంకుతున్న జనాలు
- నియంత్రణపై పట్టింపు కరువు



కౌటాలలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

గ్రామాల్లో వీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సానికి పిల్లలు, పెద్దలు నానా అవస్థలు పడుతున్నారు. శునకాలు గుంపులుగా తిరుగుతూ ప్రజలు, మేకలు, గొర్రెల మందలపై దాడి చేస్తున్నాయి. గతంలో వీధి కుక్కల దాడిలో జిల్లాలో పలువురు చిన్నారులు మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. గత కొద్దిరోజులుగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రజలపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు.

కౌటాల: జిల్లాలో కుక్కల బెడదతో గ్రామాల్లోని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగా సంచరిస్తూ ప్రజలు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి. వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. శునకాల దాడులు నిత్య కృత్యంగా మారాయి. దీంతో రోడ్లపైకి రావాలంటే ప్రజలు భయాపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

వీధుల్లో స్వైర విహారం..

హోటళ్లు, చికెన్ షాపులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో వాటికి అలవాటు పడిన కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలను చుట్టుముట్టి దాడి చేస్తున్నాయి. ప్రతీ ఆరునెలలకు ఒకసారి ఇళ్లలో ఉండే పెంపుడు కుక్కలకు ఇంజక్షన్లు వేయిస్తారు. వీధి కుక్కలకు స్థానిక సంస్థలు చేయించాలి. కాని అలా జరగడం లేదు. వాటి కట్టడికి కు.ని చికిత్స చేయాల్సి ఉన్నా ఒక్కో కుక్కకు సుమారు రూ. 2వేల ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని నాలుగైదేళ్లుగా ఒక్క శస్త్రచికిత్స చేసిన దాఖలాలు లేవు. ఫలితంగా వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

నియంత్రణ చర్యలు శూన్యం..

వీధి కుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలదే. అయినప్పటికీ సిబ్బంది కొరత, నిధుల లేమి, ఇతరత్రా కారణాలతో పట్టించుకోవడం లేదు. పలు శాఖల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి.. ప్రతి నెలా సమావేశం నిర్వహించి కుక్కల సంతతి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించాలి. కానీ అటువంటి సమీక్షలే కానరావడం లేదు. అధికారులు వెంటనే కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లాలో జరిగిన పలు సంఘటనలు..

- గత జనవరి 30న సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన గొత్రే శ్యామల అనే మహిళపై విచక్షణారహితంగా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు.
- గత నెల 30న కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామానికి చెందిన పి.శంకర్, ఎన్.ధర్మరాజులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటనలో వారి తలకు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి.
- గత నెల 18న కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీ నగర్ కాలనీలో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.
- ఈ నెల 16న కాగజ్‌నగర్ పట్టణంలోని 2వ వార్డులో పిచ్చి కుక్కలు ముగ్గురిపై దాడి చేసి గాయపర్చాయి. దాడి చేసిన పిచ్చికుక్కను స్థానికులు హతమార్చారు.



ఇటీవల వేంపల్లిలో గాయపడిన మహిళ

దాడులు చేస్తున్నాయి

వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో చాలా భయంగా ఉంది. చిన్న పిల్లలను బయటకు పంపించాలంటే జంకుతున్నాం. పిచ్చికుక్కలు ప్రజలతో పాటు జీవాలపై దాడులు చేస్తున్నాయి. రాత్రి వేళల్లో కుక్కలు గుంపులుగా చేరి అరుస్తున్నాయి. కుక్కలు ఎప్పుడు దాడి చేస్తాయోనని భయపడుతున్నాం. అధికారులు కుక్కలను నియంత్రించాలి.

– శైలజ, ముత్తంపేట్

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్వో లోకేశ్వర్ రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో లోక్‌సభ ఎన్నికలు –2024 నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమం –2024లో భాగంగా తుది ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. ఫాం 6, 7, 8 ద్వారా 24,104 దరఖాస్తులు రాగా, 21,382 దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. 720 దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తిరస్కరించినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి, బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లాలోని ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాల తనిఖీ



జెడ్పీ సీఈవోను సన్మానిస్తున్న ఎంపీడీవో



సిర్పూర్(టి): రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో అనిల్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకంలో మండలంలో చేపడుతున్న పనులు, కూలీల పని దినాలు, చెల్లింపులపై వివరాలు ఆరా తీశారు. ఎంపీడీవో గంగాసింగ్ కార్యాలయ సిబ్బందితో కలిసి సీఈవోను శాలువాతో సన్మానించారు. ఏవో తోటాజీ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో పి.సత్యనారాయణ, ఎంపీవో టి.కృష్ణమూర్తి ఉన్నారు.

బెజ్జూర్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఏసీఎంవో పుర్క ఉద్ధవ్

జైనూర్: ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీఎంవో పుర్క ఉద్ధవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జైనూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో కంచన్‌పల్లి, మహగాం, జైనూర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్ల విద్యను పెంపొందించేందుకు 100 రోజుల కార్యక్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఏటీడీవో పురుషోత్తం, డీఆర్‌పీ వామన్, ప్రధానోపాధ్యాయులు మండాడి సోనేరావు, అనిత, చొక్కారావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని ఝరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలు, శ్మశానవాటికలు, నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ మార్యదర్శి వాజిద్, మాజీ సర్పంచ్ న్యానేశ్వర్ ఉన్నారు.

రెవెన్యూ భూమిని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: పెంచికల్‌పేట మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 61లో ఉన్న రెవెన్యూ భూమిని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని కోరుతూ గ్రామస్తులు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 61లో 1,250 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. అందులో కొంత భూమిని పేదలకు పంచి 30 ఏళ్ల క్రితం పట్టాలిచ్చారని తెలిపారు. మిగితా భూమిని అటవీశాఖ అధికారులు తమకు చెందినదంటూ పేర్కొంటున్నారని, వెంటనే ఆ భూమిని గ్రామ ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. ఎంపీటీసీ రాజం, మాజీ సర్పంచ్ గణపురం కావ్య నాగేశ్వర్, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు సంతోష్, రాంచందర్, రాజన్న, తిరుపతి, శ్రీనివాస్, మధుకర్ ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణంతో అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న విశ్వ ప్రసాద్‌రావు, అజ్మీర శ్యాంనాయక్

రెబ్బెన: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌లు అన్నారు. రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలో రూ.4లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మురళీ, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ తొలగింపు



వెంచర్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌ను మంగళవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో వెంచర్ల నిర్మాణం చేపట్టరాదన్నారు. ఆర్ఐ ఖలీక్, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో జగద్గురు రామానందాచార్య దక్షిణ్ పీఠం నానీజ్‌ధామ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నరేంద్ర బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు సత్యనారాయణగౌడ్, బాపురావు, సంతోష్, నిర్వాహకులు దిలీప్, పంఢరీ, సునీత, ఉష, మారుతి, పద్మ, బావుజీ, దేవ్‌రావు, బాలజీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సాంస్కృతికోత్సవం, కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రణాళికతో చదవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ ఆధ్వర్యంలో ఆయనతో పాటు బదిలీపై వెళ్లిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌దాస్, కెరమెరి ప్రిన్సిపాల్ పరుశురాం, అధ్యాపకులు చంద్రశేఖర్, మహేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సిర్పూర్(టి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేశ్, ప్రిన్సిపాల్ బాలరాజు, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ



కాలిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్: ఇటీవల ఉశేగాం గ్రామంలో పెందూర్ అమృత్ పటేల్‌కు చెందిన శనగ పంట కాలి బూడిద కాగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, హెచ్ఆర్‌సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బోరిగాం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. సీసీరోడ్డు నిర్మాణానికి ఈజీఎస్ నిధులు మంజూరు కాగా పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, జిల్లా అధికార ప్రతినిధి సమీర్‌గుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

నార్నూర్: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఆమె పర్యటించారు. గాదిగూడలో 28, నార్నూర్‌లో 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 1,00,116 నగదుతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మోతుబాయి, ఎంపీడీవో జవహర్, తహసీల్దార్ జాడి రాజలింగు, డిప్యూటీ తహసీల్దార్ అమత్‌లాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగోరావ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఊర్వేత రూప్ దేవ్, బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు హనుమంతరావు, సయ్యద్ ఖాసిం, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఎంఐఎం మండల అధ్యక్షుడు బాబాఖాన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు లోకండే చంద్రశేఖర్, ఏజెన్సీ గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ దాదేఅలీ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



పరిచయం చేసుకుంటున్న అనిల్‌కుమార్

లింగాపూర్: మండలంలోని గుమ్నూర్(బి)లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కంచన్‌పల్లి జట్టుకు మొదటి బహుమతి రూ. 20151లను కనక మోతీరాం, రెండో బహుమతి పటేల్ టీం, జైనూర్‌కు రూ. 11,051లను బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆత్రం అనిల్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆత్రం శేషు, లక్ష్యా, దత్తు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఎడవెల్లి

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో బండ భవాని స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో బీబ్రా, ఆసిఫాబాద్ మండలం ఎడవెల్లి జట్లు తలపడగా ఎడవెల్లి జట్టు విజేతగా నిలిచింది. ఎడవెల్లి జట్టుకు రూ.25 వేల నగదు, బీబ్రా జట్టుకు రూ.15 వేల నగదు అందజేశారు. మాజీ సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి, నిర్వాహకులు ముక్తేశ్వర్, రమేశ్, విఘ్నేశ్వర్, మణికంఠ, విశ్వజిత్ పాల్గొన్నారు.

కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



అభిషేకం చేస్తున్న పండితులు

వాంకిడి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో అభయాంజనేయ, శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హోమం, కలశ స్థాపన, విగ్రహ మూర్తులకు కలశాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు పెంద్యాల గౌతం శర్మ, సీతారాం శర్మ, ఇందారపు శంకర్ శర్మల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.